క్లుప్తంగా

23న గ్రామ పంచాయతీ పనుల వేలం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే వివిధ పనుల నిర్వహణకు వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ గోపినాథ్ తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంతమార్కెట్ గేటు వసూలుకు ప్రాథమిక ధరావత్తు రూ.2.50 లక్షలు, దినమార్కెట్ పనులకు రూ. 2 లక్షలు, బస్టాండ్‌కు రూ. 2 లక్షలు, కమేళకు రూ. 7,500 ధరావత్తు నిర్ణయించామన్నారు. ఆసక్తిగల వ్యక్తులు ఈ నెల 23వ తేదీన గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే బహిరంగ వేలంపాటలో పాల్గొని పనులు దక్కించుకోవచ్చని సూచించారు.

స్వామినగర్‌లో అగ్ని ప్రమాదం


కాలనీలో ఎగిసి పడుతున్న మంటలు

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని స్వామినగర్ కాలనీలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. కొందరు జులాయిలు ఇళ్ల నివాసాల మధ్య ఉన్న ముళ్లపొదల మండెలకు నిప్పు పెట్టారు. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడి ఇళ్ల వైపుకు వ్యాప్తి చెందుతుండడంతో కాలనీ వాసులు భయభ్రాంత్రులకు గురయ్యారు. స్థానికుల సమాచారం మేరకు బనగానపల్లె అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో ఎలాంటి ఆస్తినష్టం జరగలేదు.

నోటి శుభ్రతపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యలచెర్వు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రపంచ నోటి శుభ్రత సంరక్షణ దినం సందర్భంగా బుధవారం విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు నోటి శుభ్రత అవసరం అని దంత వైద్యుడు వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు టూత్ పేస్టులు, బ్రష్‌లు ఉచితంగా వైద్యుడు వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయ లక్ష్మి, ఆశా వర్కర్లు మల్లేశ్వరి, రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వందలీటర్ల నాటుసారా స్వాధీనం


నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ జోగేంద్ర

బనగానపల్లె రూరల్ : సెబ్ సీఐ జోగేంద్ర ఆధ్వర్యంలో బుధవారం సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలోని అయ్యప్పస్వామి గుడి వద్ద షేక్ దస్తగిరి మోటార్ సైకిల్‌పై నాటుసారా తీసుకెళ్తుండగా అరెస్టు చేశారు. వంద లీటర్లతో పాటు బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. అలాగే మండలంలోని రామతీర్థం గ్రామ అటవీ ప్రాంతంలో నాటుసారా తయారీ స్థావరంపై దాడులు చేసినట్లు సీఐ తెలిపారు. 1,800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 40లీటర్ల సారా సీజ్ చేశామన్నారు. బెల్లం ఊట ఇదే గ్రామానికి చెందిన కావేటి శ్రీను, కావేటి బాలమద్దిలేటికి చెందినదిగా గుర్తించామని, వారిని త్వరలో అరెస్టు చేస్తామని సెబ్ సీఐ జోగేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్‌ఐలు పోతులయ్య, అంజాద్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంక్ సీఈఓ

బేతంచెర్ల: ఖాదాదారుల శ్రేయస్సే ధ్యేయంగా మెరుగైన సేవలు అందిస్తామని కోవెలకుంట్ల కోఆపరేటివ్ బ్యాంక్ సీఈఓ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ లైన్ రోడ్డులో కోవెలకుంట్ల కోఆపరేటివ్ నూతన బ్రాంచ్‌ను బ్యాంక్ అధ్యక్షుడు సముద్రాల శ్రీనివాస రావు అధ్యక్షతన ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు గుండా గోపాల్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల మోహన్ రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులకు దీటుగా అన్ని డిజిటల్ సౌకర్యాలతో బ్యాంకింగ్ సేవలు ఖాతాదారులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సతీష్ కుమార్, పారిశ్రామిక వేత్తలు పాలెం శివారెడ్డి, భీమేశ్వర్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, ఆర్యవైశ్యులు గుండా జగన్, జనార్ధన్, విష్ణు, ధనుంజయ, బళ్లాని సూర్య తదితరులు పాల్గొన్నారు.

కలుచట్ల నాడు అధోగతి...

నేడు పురోగతి

- ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్ల నిర్మాణాలతో కళకళలాడుతున్న గ్రామం
- మజరా గ్రామాలకు సైతం చేకూరిన మౌలిక వసతులు
- ఏళ్లతరబడి నెలకొన్న రహదారి సమస్యలు పరిష్కారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు


కలుచట్ల మెయిన్ బజార్ పక్క వీధిలో వేసిన సీసీ రోడ్డు

ప్యాపిలి: గ్రామ స్వరాజ్యం సాకారం దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గత టీడీపీ హయాంలో కనీసం మండల కేంద్రాలకు దగ్గరగా ఉన్న గ్రామాలు సైతం అభివృద్ధిని నోచుకోలేక పోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి బాట పట్టాయి. కలుచట్ల గ్రామం మండల కేంద్రం ప్యాపిలికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ గత ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. కలుచట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్ రంగాపురం, ఎస్ నల్లబల్లి, ఎర్రగుంట్లపల్లి గ్రామాల పరిస్థితి మరీ అధ్వానం. కలుచట్ల గ్రామంలో 2,317 మంది, ఈ పంచాయతీ పరిధిలోని ఎస్ రంగాపురంలో 453 మంది, ఎస్ నల్లబల్లిలో 162 మంది, ఎర్రగుంట్లపల్లిలో 384 మంది జనాభా నివసిస్తున్నారు. కనీస వసతులు కరువై ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

కళకళలాడుతున్న పల్లెలు

2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ గ్రామాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. సీసీ రోడ్ల ఏర్పాటుతో గ్రామాల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది. సచివాలయం, రైతుభరోసా కేంద్రాలతో కలచట్ల గ్రామం కళకళలాడుతుంది. మజరా గ్రామాల్లోనూ మౌలిక వసతులు చేకూరడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కలచట్ల శివారు ప్రాంతంలో శిథిలావస్థలో ఉన్న పట్టు పరిశ్రమ కేంద్రాన్ని రూ. 20 లక్షలతో ఆధునీకరించి ఉద్యాన రైతుల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తమ గ్రామాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కలుచట్ల పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కలుచట్లలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు


ఎర్రగుంట్లపల్లికి రూ. 58 లక్షలతో వేసిన సీసీ రోడ్డు


కలుచట్ల మెయిన్ బజార్ వేసిన సీసీ రోడ్డు

కలుచట్ల పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు

- రూ. 16 కోట్లతో నిర్మించిన ప్యాపిలి–పత్తికొండ డబుల్ రోడ్డు
- రూ. 30 లక్షలతో కలుచట్ల బీసీ కాలనీ, మెయిన్ బజార్‌లో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ. 20 లక్షలతో కలుచట్ల నుంచి పొలాలకు వెళ్లే రహదారిలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు
- రూ. 58 లక్షలతో కలుచట్ల పట్టు పరిశ్రమ కేంద్రం నుంచి ఎర్రగుంట్లపల్లికి సీసీ రోడ్డు
- రూ. 35 లక్షలతో కలుచట్ల గ్రామంలో సచివాలయ కేంద్రం
- రూ. 23 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం
- రూ. 20 లక్షలతో ఉద్యానరైతుల శిక్షణ కేంద్రం

మౌలిక వసతులు కల్పించాం



ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాం. బీసీ కాలనీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించడంతో వీధులు కళకళలాడుతున్నాయి. ఏళ్లతరబడి నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాం. మరి కొన్ని వీధుల్లోనూ డ్రైనేజీ సమస్య ఉంది. కొత్తగా సీసీ రోడ్లు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభించి ఆ వీధుల్లో కూడా డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం. – రమాదేవి, సర్పంచ్

మా గ్రామం అభివృద్ధి చెందింది



మా గ్రామం కలచట్ల ప్రస్తుతం బాగా అభివృద్ధి చెందింది. కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం ద్వారా మా ఊరికి కొత్త కళ వచ్చింది. మండల కేంద్రాల్లో మాత్రమే కనిపించే విశాలమైన ప్రభుత్వ భవనాలు గ్రామాల్లో నిర్మించడం ద్వారా అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. మా గ్రామం మీదుగా డబుల్ రోడ్డు నిర్మించడంతో ప్రయాణ కష్టాలు కూడా తొలగిపోయాయి. – రామ్మూర్తి, కలచట్ల

ఘనంగా పెద్దమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామంలో పెద్దమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి గ్రామ పెద్దలు, రైతులు ఆధ్వర్యంలో ప్రత్యేంగా ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారి ప్రతిమను ముస్తాబు చేసి బలిక్రతువు, ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా భక్తులు బోనాలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు వంగాల సురేష్‌కుమార్‌రెడ్డి, గాలి హనుమంతరెడ్డి, లింగాల నాగేశ్వరరెడ్డి, మహానందిరెడ్డి, హుస్సేన్, సుబ్బిలక్ష్మీ రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బీరం సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండల పరిధిలోని మల్యాల సబ్ స్టేషన్‌లో కెపాసిటర్ బ్యాంక్ ఏర్పాటు నేపథ్యంలో గురువారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్యాల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6గంటల వరకు కరెంటు ఉండదన్నారు. వ్యవసాయానికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇస్తామన్నారు. అలాగే చిన్న మల్కాపురం సబ్ స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నందున మల్కాపురం,రంగాపురం పరిధిలోని గ్రామాలకు, ఫ్యాక్టరీలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

వాహనాల తనిఖీ

సంజామల: మండల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ క్రాస్ వద్ద ఎస్‌ఐ రమేష్ రెడ్డి బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. కోవెలకుంట్ల, తాడిపత్రి, అవుకు తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల నాపి తనిఖీ చేశారు. లైసెన్స్, ఆర్సీని తదితర రికార్డులను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనచోదకులకు ఎస్‌ఐ జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

డోన్ టౌన్ : స్థానిక కర్నూలు రోడ్‌లో ఉన్న విజయ గ్యాస్ ఎదుట బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు పట్టణ సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్ ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్న ముబీనా స్కూటీపై ఇద్దరు పిల్లలతో వెళ్తున్నారు. అదే సమయంలో యువకుడు ఉదయ్‌కుమార్ బైక్‌పై వస్తున్నాడు. యూటర్న్‌లో రెండు వాహనాలు ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు వీరిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మంత్రి బుగ్గన చొరవతో గ్రామాలు అభివృద్ధి


ప్రచారం నిర్వహిస్తున్న బుగ్గన అర్జున్ రెడ్డి

ప్యాపిలి: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మంత్రి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బుగ్గన అర్జున్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరో వైపు అభివృద్ధికి కూడా పెద్దపీట వేశారని తెలిపారు. తన తండ్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గత ఐదేళ్ల కాలంలో డోన్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజవకర్గంలా తీర్చి దిద్దారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, బషీర్, కొండయ్య, మస్తాన్, గండికోట రామాంజనేయులు, నిజాం, రఘు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం


వైద్యసేవలపై డాక్టర్లతో చర్చిస్తున్న కమిషనర్ జయరాం

డోన్ : పట్టణంలోని ఇందిరానగర్ సచివాలయం పరిధిలో బుధవారం అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హెల్త్ క్యాంప్‌ను మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ షాబాజ్ హుసేన్‌తో వైద్య సేవలపై కమిషనర్ చర్చించారు. ఆరోగ్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.

శానిటేషన్ పనుల పరిశీలన

ఇందిరానగర్ జరుగుతున్న శానిటేషన్ పనులను కమిషనర్ డాక్టర్ జయరాం పరిశీలించారు. మురికి కాలువల్లో చెత్త, చెదారాన్ని పారవేయకుండా మున్సిపల్ చెత్త ట్రాలీలో వేయాలని కమిషనర్ ప్రజలకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆయన స్థానికులకు తెలిపారు. కార్యక్రమంలో డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


ఆర్ బుక్కాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ ప్రియతం రెడ్డి కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండలంలోని ఆర్ బుక్కాపురంలో ఎస్ఐ శివ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో రాత్రి బస కార్యక్రమం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలతో సీఐ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాంతియుత జీవనం గడపాలన్నారు. గ్రామాల అభివృద్ధికి పాటు పాడాలి కాని గొడవలకు దూరంగా ఉండాలన్నారు. గొడవలకు పాల్పడినా, సృష్టించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి, కానిస్టేబుల్ మధు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


అభ్యర్థుల వ్యయ లెక్కింపుపై అప్రమత్తంగా ఉండండి

నంద్యాల: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ లెక్కింపుపై అప్రమత్తంగా ఉండాలని, ఇందుకు సహాయ వ్యయ లెక్కింపు అధికారులు, వీడియో సర్వేలైన్ టీమ్‌లు, వీడియో వ్యూవింగ్ టీమ్‌లు పూర్తిస్థాయి శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితిపై సహాయ లెక్కింపు, వీడియో సర్వేలైన్ టీం అధికారుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన మేరకే ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఈ మేరకు ఖర్చును లెక్క కట్టి ప్రతి రోజూ నివేదికలు ఇవ్వాలని సూచించారు. బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రకటనలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు, ఆహార పదార్థాల ఖర్చులతో సహా లెక్కించాలని చెప్పారు. సి విజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేశారని, ఎన్నికల్లో మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల వ్యయ నోడల్ అధికారి వెంకటసుబ్బయ్య, ఏఎస్పి కె.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

తీరిన నీటి సమస్య!

- తొలగిన ఏళ్లనాటి తాగునీటి ఇబ్బందులు
- రూ.50 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, ఇంటింటికీ కుళాయి కనెక్షన్
- సంతోషం వ్యక్తం చేస్తున్న మీర్జాపురం గ్రామస్తులు


ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో నిర్మించిన గ్రౌండ్ లెవల్ సంప్


నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్

కొలిమిగుండ్ల: దాహంతో అల్లాడుతున్న ప్రజలకు కనీసం గొంతు తడుపు కునేందుకు నీటి సౌకర్యం కల్పించలేకపోయింది గత ప్రభుత్వం. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం కొలిమిగుండ్ల మండల పరిధిలోని మీర్జాపురం. ఎన్నో సార్లు గ్రామస్తులు తాగునీటికి శాశ్వత పరిష్కారం కల్పించాలని మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. మంచినీటి కోసం ఊర్లో భగీరథ ప్రయత్నం చేసినా చుక్క నీరు పడేది కాదు. పదుల సంఖ్యలో బోర్లు వేసినా గంగమ్మ జాడ కనిపించకుండా పోయింది. మండల కేంద్రం కొలిమిగుండ్లకు 4కి.మీ దూరంలో మీర్జాపురం గ్రామం ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్తులు పడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి. జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.50 లక్షలతో 40 వేల లీటర్ల గ్రౌండ్ లెవల్ ట్యాంక్, 40 వేల లీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్ లెవల్ సంప్ నిర్మించారు. 24 గంటల విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసి మంచినీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో ఏళ్లతరబడి మీర్జాపురం గ్రామస్తులు ఎదుర్కున్న నీటి సమస్య పరిష్కారమైంది.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

గతంలో గ్రామానికి సుదూరంగా ఉన్న బోరు నుంచి తాగునీటి సౌకర్యం అందిస్తుండేవారు. నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. వేసవిలో పరిస్థితి మరింత దారుణం. ఉన్న ఒక్క స్కీం పాడైపోతే నీటి కష్టాలు వర్ణనాతీతం. కొలిమిగుండ్ల నుంచి నీళ్లు తీసుకెళ్లినా సందర్భాలు ఉన్నాయి. ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ సహకారంతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందించేలా చర్యలు చేపట్టారు. దశాబ్దాల తర్వాత ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం జరిగింది. అవుకు సీపీడబ్ల్యూస్కీం మూడో ఫేజ్ కింద గ్రామానికి కొలిమిగుండ్ల నుంచి పైపులైన్ ఏర్పాటు చేశారు. ఈనీటిని వినియోగించుకునేందుకు 40 వేల లీటర్ల గ్రౌండ్ లెవల్ సంప్ ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం చూపడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి వద్దకు నీళ్లు రావడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నీటి కష్టాలు తీరాయి



నీళ్ల కోసం చాలా కష్టపడేవాళ్లం. రోడ్డు మీద ఉన్న చిన్న ట్యాంక్ వద్దకు పోయి నీళ్లు తెచ్చుకునేవాళ్లం. ఎండల కాలంలో పడరాని పాట్లు పడ్డాం. మావీధిలో పైపులైన్ ఉండేది కాదు. ఇప్పుడు పైపులైన్ వేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చారు. ఎక్కడికి పోవాల్సిన అవసరం లేకుండా పోయింది. చాలా సంతోషంగా ఉంది. నీటి సమస్య తీరుతుందని ఊహించలేదు. – లక్ష్మి, మీర్జాపురం

పుష్కలంగా నీళ్లు వస్తున్నాయి



ఉదయం, సాయంత్రం నీళ్లు పుష్కలంగా వస్తున్నాయి. మేం ఉన్న చోటకే నీళ్లు వస్తుండటంతో ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ఎన్నో సంవత్సరాల తర్వాత మాకు నీళ్ల కష్టాలు తప్పినందుకు సంతోషంగా ఉంది. ఇంతకు ముందు బోరు, మోటార్ చెడిపోయినా చాలా కష్టాలు పడేవాళ్లం. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి కృతజ్ఞతలు. – సుబ్బులక్షుమ్మ, మీర్జాపురం

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన భాస్కర్

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలో నంద్యాలకు చెందిన బుడగజంగాల భాస్కర్(30 క్రిమిసంహారక మందు తాగి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు నంద్యాలకు చెందిన భాస్కర్ బనగానపల్లెలోని పెండేకంటినగర్ కాలనీలో నివాసం ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. అయితే రాత్రి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడాడు. ఈ విషయాన్ని తానే ఫోన్ ద్వారా బంధువులకు సమచారం ఇచ్చారు. దీంతో వెంటనే భాస్కర్ ఉన్న ప్రదేశానికి బంధువులు చేరుకొని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స అందిస్తుండగానే కొలుకోలేక మృతి చెందినట్లు తెలిపారు. భాస్కర్ ఎందుకు ఆత్యాహత్యకు పాల్పడ్డాడనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సివుంది. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నట్లు తెలిసింది.

నోటి క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

నంద్యాల టౌన్: ప్రతి ఒక్కరూ నోటి క్యాన్సర్ గురించి అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. బుధవారం నేషనల్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా స్థానిక కార్యాలయం నుంచి సాయిబాబా నగర్ ఆర్చ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు, బీడీ, సిగరెట్ లాంటి క్యాన్సర్ కారక వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అతి చల్లని, వేడి పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. జిల్లా టీబీ అధికారి శారదాబాయి, డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి, కాంతారావు నాయక్, డెమో ఆఫీసర్ రవీంద్ర నాయక్ ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com